
# ఊటబాయి



డొక్కుది కిరాయిసైకిల్ ముందట రెండు వెనుక రెండు శిక్కాలు. శిక్కాల నిండా మొసాంబీలు' (బత్తాయిపండ్లు) 'బాపూ సద్దితీసుక పోయే' అంటే 'ఎందుకు బిడ్డా పగటి యాల్లవరకు వస్త'నని బయల్దేరిన ముత్తయ్య ఊరు దాటేవరకే పది దాటింది. పొద్దు పొడువంగ బయల్దేరిన మనిషి.

ఎల్లుడు ఎల్లుడే ఊరు దాటుతుండెగనీ ఒకటో రెండో పండ్లు అమ్ముడుపోతాయనే ఆశ అతడిని సందు సందుకూ తిప్పింది. ఒక్క పండూ అమ్ముడు పోలేదుగనీ పండ్లగంప అయిండు. ఎవలూ ఒక్క పండు కొనలేదుగనీ పరాచికాలాడింద్రు. 'ఏమోయ్ బామ్మర్ది మోసాంబి తోట పట్టినవట గదా పండ్లు తినిపియ్యవా' అని కొందరు, 'ఏందిరా.... కచ్చకాయలంత గూడా లెవ్వు రూపాయికి ఒక్కటి అమ్ముతవా? అని కొందరు ఉద్దెర ఇయ్యడట, ఊరిడిచి పోతున్నమా అని కొందరంటే, 'అబ్బ అడ్డికి పావుశేరు అమ్ముతడు. పిల్లికి పిడుసెయ్యడు. ఎప్పుడు ఏదో పండు, మస్తు సంపాయిస్తుండు' అని కొందరు.

తప్పించుకొని సైకిలెక్కేవరకు పరికి ముండ్ల కంపలోంచి బయటకచ్చినట్టయింది. ఊరికి దూరంగా వచ్చినా మాటలు వెన్నంటి వస్తున్నట్టే ఉన్నాయి. మాటలుగావవి, ముక్కుల ఎంటికెలు పీకినట్టు... కాంటతోని గెలికిచ్చినట్టు....! సైకిల్ తొక్కుతున్నాడు ముత్తయ్యకోపంగా.

'అసలు నీదే తప్పు. తిరుగద్దనే అనుకున్నవు. మల్లెందుకు తిరిగినవు..? మంచిగైనాది తాతకొడుక. మనిషికొక్కమాట అనిరి. ~~ఈ~~ సారి ఊరని యాది జెయ్యకుంటయింది. బాలమల్లయ్య ఏమన్నడు..? 'అప్పు తీసుకునేటప్పుడు నారవిల్లి

లెక్కవస్తవు. పండనవు కాయనవేందిరా' అనలేదూ...? పండ్లు నీయింట్ల పుట్టినయా! అట్ల పంచి పెట్టాలంటే ఊరంత చుట్టాలే! వెయిలకు వెయిలు ఖర్చుపెట్టి తోటలు గుత్త పట్టాలె. వీళ్ళకు పంచిపెట్టాలెనట. పొద్దటిబోణి, బేరమాడకుంట నాలుగు పండ్లను కొందామన్న ఇమరస ఎవలకన్న ఉన్నదా...?

సైకిల్ సోమవారపు అంగడివైపు దూసుకపోతుంది. పది కిలోమీటర్ల పైనే! ఎదురుగా వస్తున్న అంగడి పశువులను తప్పుకుంటూ ముదురుతున్న ఎండ శక్తినంతా రంగరిస్తున్నట్టు ఒంటినిండా చెమట దారలు.

'తోటపాడుగాను తోటను గుత్తకు పట్టిన్నుండి ఇదే గోస. పూతగొన్నది మొదలు కాతకచ్చేదాక ఎటమటం గావట్టె. ఇంతవరదాకా తోటను గుత్తకు పట్టినోళ్ళందరు పైకొచ్చిండ్రు. నీదరిద్రమో శనేసిరమో గని నువ్వు అడుగు పెట్టినవంటే చెట్టుమీద పూత నిలువక పోయె. కాత నిలువకపోయె. అప్పుడు మొగుళ్ళు మబ్బువడి పూతంత రాలిపాయె. యాడనన్న ఒక్కటుంటె కంకెడు కంకెడు కాయ కచ్చకాయ లంతయి పాయె.' తిట్టుకుంటున్నాడు.

ఒకవైపు ఎడ్ల అంగడి. మరోవైపు సరుకులది. ఎక్కడ జూసినా మొసాంబీకుప్పలే! కంకెడు కంకెడు బంగారాన్ని ముద్దలుగట్టికుప్పలు పోసినట్టు. ఎండకు మరింతగా మెరుస్తున్నాయి. సైకిలిని ఒక పక్కకు నిలిపి ఎగపోస్తూ నిలబడ్డాడు ముత్తయ్య.

'గాపండ్లు జూడు... సూత్తెనే కడుపు నిండి నట్టు. ఇగనీ పండ్లున్నయి. వాడిపోయి వక్కిపోయి నట్టు. వట్టిగ ఇస్తనన్నా తీసుకోరు. ఇక్కడ ఉండుడు కంటే ఊర్లెతిరిగింది నయం. కొన్ని కొన్నయినా అమ్ముడుపోతయి.' ఈ ఆలోచన రాగానే-

సైకిలెక్కి 'మొసాంబీ' అని ఊర్లో తిరిగాడు. తల్లి కడుపులోకి పొద్దు జారుతుండగా ఇంటి ముందు సైకిలి దిగాడు. శిక్కాలు నిండుగానే ఉన్నాయి. జేబులో చిల్లరపైసలు. శిక్కాలను ఇంట్లో పెడుతూ చూసాడు. ఒక గంపనిండా మురిగిన పండ్లు. మరో గంపనిండా కొత్తగా తెచ్చిన పండ్లు. మాగబోసిన అర్రలోకి తొంగిచూస్తే పండ్లు మాగిన వాసనకంటే మురిగిన వాసనే ఎక్కువయి నట్టుంది. రోతపుట్టుకచ్చింది.

సైకిల్ చప్పుడుకు ఇంట్లోంచి వచ్చిన దేవేంద్ర, నిండు శిక్కాలను చూసినాక వాడిపోయిన పండయింది. తండ్రివైపు, పండ్లవైపు మార్చి మార్చి చూసి మురిగిన పండ్లగంపను సైకిల్ మీద పెట్టింది.

'నువ్వు అనుకుంటనే ఉన్నవు. ఎట్లపోయిండో గట్లనే తిరిగత్తడని. వద్దని చెప్పితే వింటడా..? నాయినా మనకు గుత్తలు అచ్చిరావే... పట్టద్దే అని మొత్తుకున్న. వింటేనా...? ఇప్పుడు జూడు రాలేపండ్లు ఆగుతలెవ్వాయె... పండినయి అమ్ముడు పోతలెవ్వాయె.'

"ఏంది బిడ్డా మల్ల గంపెడు మురిగి పోయినయా.... పెద్దసేటు ఎంత మోసం జేసిండు. లారీ నిండ పండ్లు తెచ్చినా తీసుకుంట, తోటను ఇడువకు అన్నడు. ఇప్పుడేమో అమ్ముడు పోతలెవ్వు అంటున్నడు." గచ్చులో సిమెంటుగోళెం, పలిగి పోయిన ప్లాస్టిక్ మగ్గుతో మొహంపై నీళ్లను చల్లు కుంటూ అడిగాడు ముత్తయ్య.

దూలాలకు తాళ్లతో వేలాడ గట్టిన ఎలితెబొంగు దండెం.దండెం మీద బట్టలు, తువ్వాలను

తీసి తండ్రికి అందించింది దేవేంద్ర. "మురిగి పోయేటియిమురిగిపోతయి నాయినా... మల్ల రెండు గంపలు రాలినయి గదా! రాలినయి రాలినట్టు అమ్ముడువోతె మంచిగుండు. చెట్టుమీద ఉన్నా ఎప్పుడో అమ్ముడు పోయినప్పుడు తెంపు కుందుము. అట్లగాదాయె ఇట్లగాదాయె" గొంతులో బాధ.

తోటను గుత్తకు పట్టింది మొదలు కావలి కాని జీతం, కైకిళ్లు... లెక్కలన్నీ కళ్ల ముందు కదులుతున్నాయి. పచ్చికాయ ఇంటికచ్చి పండు పండి బయటకు పోయేదాక ఆమె చేతులు చంటి పిల్లను లాలించే తల్లి చేతులవుతాయి. ఆరు గాలము ఆ ఇంట్లో ఎప్పుడూ ఏదో పండువాసన. పండు పండునూ తడిమి బతుకును పండించు మని బయటకు పంపుతుంది. అవి అమ్ముడయినా నిండని అప్పుల నెరికె ఆమెను ఎప్పుడూ నాలుకలు చాపి భయపెడుతనే ఉంది.

తువ్వాలతో మొహం తుడుచుకుని ఇనుప కుర్చీ మీద కూచున్నాడు ముత్తయ్య. దేవేంద్ర నిండు శిక్కాలను విప్పి పండ్లను అర్రలోని నేలపై పరుస్తుంది. అంతకుముందే అడుగుపెట్ట సందులేదు. పైనున్న వరిగడ్డిని జరిపి పండ్లను దగ్గరికి సర్ది ఖాళీజాగలో ఈ పండ్లను పెడుతుంది.

"నాయనా.... వద్దన్న పని వాలాయించి చేత్తవు. అంతకుముందు చింతతోట వద్దు వద్దంటే వినక అర్రాసు పాడి పడితివి. దాంట్ల లాసు వచ్చి అప్పుల పాలైతిమి. ఆటెనుక నిమ్మతోట. దానెనుక రేనితోట.... ఒక్కొక్కటి లాసేగనీ లాభం లేదాయె. ఇప్పుడు ఈ తోట వట్టి అన్ని తీరుపుతనంటివి. ఇది ఇంకింత లాసు తెచ్చె. రోజురోజుకు లోపటికి పోవుడే గని పైకి వచ్చింది లేదు. నువ్వు అటు కడుప దాటినవో లేదో అంజయ్య సేటు ఇంట్లకచ్చి కూసున్నడు. లెక్క చూసుకుని పైసలు కట్టేదాక కదులనంటడు. తట్టల పదిగల్ల మొసాంబీలు పెట్టి బతిలాడి పంపిన". ఆమె గొంతులో యాష్టకంటే ఎక్కువగా హెచ్చరిస్తున్న తీవ్రతనే ఉంది.

ముత్తయ్యకు కండ్లలో నీళ్లు చిప్పరిల్లినయి. కూతురు అంతగా ఎందుకు హెచ్చరిస్తుందో అర్థమయింది. ఈ తోటతో అప్పులన్నీ తీరి చేతుల నాలుగు పైసలుంటాయనుకున్నాడు. కాత తక్కువనే పట్టింది. పట్టినకాతైనా చెట్టుమీద నిలువడం లేదు. తెంపకముందే రాలుతున్నయి. రాలినయి రాలినట్లయినా అమ్ముడయితే బాగుండు. కనీసం దాచిపెట్టడానికైనా ఇంట్లో జాగలేదు. రెండే అర్రలు. ఒక అర్రల పొయ్యి, కాగులు కుండలు.

భార్య గుర్తొచ్చింది ముత్తయ్యకు. అది ఉన్నన్ని దినాలు ఇట్లనే మొత్తుకుంటుండె. తనకైతే ఎటూ ఏర్పడలేదు. పాడుగడియ వచ్చింది. అది చిప్పలకాయల కాలం. ఇంటికి ఇద్దరు మనుసులు, కాయల్ని తెంపి లారీలో పొయ్యాలి. వచ్చిన ముద్దను పంచుకోవాలి. కాయలకు బాగా డిమాండున్నది. చెట్లు కూడా ఇరగకాచినయి.

ఒక లారీ నింపితే జుట్టుకు వందపైనే! రోజుకు మూడు నాలుగు లారీలు. అదేం గాశారమో అంతకుముందు రోజు కందిరీగలు చుట్టుముట్టి పెయ్యంత కుట్టినయి. వద్దు వద్దనంగ కొంకిడి కట్టెను పట్టుకుని మరునాడు ఉబ్బు మొఖంతోనే కాయలు తెంప వోయింది.

ఆనాడు గుడ్డిముసురు. తొర్రోడు ఊంచినట్లు చినుకులు. పుట్టగడ్డమీద నిలువెత్తు చెట్టు. తెల్లగ గుడ్లు గుడ్లోలె చిప్పలకాయలు. అందకపోతె అందరూ విడిచిపెట్టిన కాయలే! ఇట్ల ఇడిచి పెట్టుకుంటపోతే లారీలు ఎట్లనిండుతాయనుకుని నాలుగు అడుగులు పైకెక్కి కొంకిడికట్టెను కాయమొదట్లో వేసింది.

బలబల చప్పుడు. 'వాయ్యో... వావ్వో...' పెడబొబ్బలు. అందరు జమకూడి ఊర్లెకు ఎత్తుకరాక ముందే నురుగులు కక్కుకుని సచ్చింది. దెబ్బమీద దెబ్బ అన్నట్టు చూడంగ చూడంగ పుట్టిన ఒక్కబిడ్డ! ముండమోసి ఇల్లు చేరింది. పెండ్లయిన యాడాదికే! అల్లుడు బాయిలు గుత్తకు పడుతడు. క్రేన్ మీది నుండి పడ్డడు. పడుడు పడుడే పానం పోయింది.

ఇప్పుడు అక్కడిక్కడ సంబందాలత్తున్నయి. నాయినా నిన్ను ఒక్కన్ని ఇడిచి ఎట్ల పోవన్నే అంటుందిగని ఇంటి మీదుంటె ఎట్ల. కలంతగాలం ముందుంది. బిడ్డగాచారం మంచిగలేదు. దాని సంసారం దానికి మంచిగుంటే నలుగురికి దానం చేసే చెయ్యి.

"నాయినా బువ్వ తిందువులెవ్వు. పొద్దున బుక్కెడు తిన్నవు. తిన్నంక సైకిల్ మీద గంపవెట్టిన. ఊరవుతల పారవోసిరా. అవి ఉన్నా దరిద్రమే...' పల్లెం అందుకుంది దేవేంద్ర.

చీకటిపడింది. కరంటు రానట్టుంది. దీసోడ మీద సీస దీపం వెలుగుతుంది. ఇల్లంతా పొగ నిండింది. వాసాల మీద ఎలుకల పరుగు. ఇంటి నిండా పండ్లు ఉండడంతో వాటికి తిండికి కొదవ లేక ఇంట్లోనే తేమిడి చేసినయి. అన్నానికి చీమలు పట్టినట్టున్నాయి. దులుపుతుంది దేవేంద్ర. ఇల్లు చీమల బొయ్యారమయింది.

విరిగిన చెక్కపీటను అందుకుని కూర్చున్నాడు ముత్తయ్య. కూతురు మొహంలో వయసుకు మించిన పెద్దతనం కనిపిస్తుంది. ఆమె జీవితం కంటే ఎక్కువగా ఇంటి గురించి అప్పు గురించే ఆలోచిస్తున్నట్టుగా కనిపిస్తుంది. అలా ఆమె కనిపించడం మొదట్లో చేదు మింగినంత బాధగా ఉన్నా, పెరుగుతున్న అప్పుల బాధ ఈ బాధను జీర్ణం చేసింది. ఎప్పుడో ఒకప్పుడు ఇంట్లో ఉన్నప్పుడు తప్ప కూతురు గురించిన ఆలోచనలు వెన్నంటి నిలువడం లేదు.

'అటీటు చూత్తుండగనే ముడేండ్లు నిండె, బిడ్డ ఇంట్లోకి అడుగుపెట్టి. దానికి నువ్వు లగ్గం జెయ్యవు. కడుపునిండితె కైలాసం పోయినంత సంబూరం నీకు. వచ్చిన మొదట్ల లగ్గం లగ్గమని తండ్లాడ్తివి. ఇప్పుడు ఆ ముచ్చట తీస్తన్నవా...? గడియ తీరికలేదు గవ్వ రాకడ లేదు. నీది నువ్వే ఆలోచించుకో. ఏమన్న లాభమున్నదా...?' ఆలోచిస్తూ తింటున్నాడు.

దేవేంద్ర తండ్రి పక్కనే బీడీలచాట ముందు కూర్చుంది ముత్తయ్య అన్నాన్ని కెలుకుతున్నాడు. మెతుకులు గొంతు దిగడం లేదు. ఎగదన్నుక వస్తున్న బాధ. పోటీమీద ధరను ఎక్కువగా పెంచి ఈ తోటను పట్టాడు. తోట పుట్టిన్నుండి 'దాన్ని గుత్తకు పట్టి నేను మునిగిన' అన్న మనిషి లేడు. ఎకరాల భూములు కొన్నారు. బిడ్డ పెండ్లి చేత్తే అదే నయం అనుకున్నాడు అప్పుడు. లాభం కాదుగదా పెట్టుబడిలో సగం రాబడి లేదు.

'నువ్వు లగ్గం జెయ్యాలనుకుంటే చేత్తువు. అప్పులో ఇంకింత అప్పు అయితదని భయపడుతున్నవు. తోటలేపట్టాలె... లాభమే రావాలె, లగ్గమే చెయ్యాలె అంటే ఈ జన్మల కాదు...' మనసు హెచ్చరిస్తుంది.

"ఏంది నాయినా...? కూరమంచిగ లేదానే.... బువ్వ తింటలెవ్వు. నాలుగు వట్టి చాపలైతే బాగుండు వంకాయలకు, రోయిరోయత్తుంది గావచ్చు. వట్టిగ వండద్దనే అనుకున్న." "నొచ్చుకుంటున్నట్టుగా అంటూ లేచి" రెండు బుక్కలకు పెరుగుపోసుకో' అంటూ గురిగి ముందట పెట్టింది దేవేంద్ర.

"కూర మంచిగనే ఉంది బిడ్డా.... అవ్వయాదికచ్చింది." గొణుక్కుంటున్నట్టుగా అంటూ గబగబా అన్నాన్ని కలుపుతున్నాడు ముత్తయ్య.

అవ్వ కాదు... అతడికి అప్పుడు ఏం యాదికచ్చిందో తెలుసు. అతడి మనసును మెలి పెడుతున్న బాధ ఏంటో కూడా తెలుసు. తెలిసి తనకు తెలుసని తండ్రికి తెలియకుంటా మసులుకోవడం ఆమెకు బాగా తెలుసు.

అన్నం తిన్నాననిపించుకుని చెయ్యి కడుక్కుని చిల్లరపైసలు లెక్కబెట్టుకున్నాడు ముత్తయ్య. 'సైకిలోడు చారాన తక్కువున్నా తీసుకోడు' అనుకుంటూ సైకిలెక్కాడు. మురిగినపండ్లను ఊరవుతల మడికట్లలో పారవోత్తుంటే దుఃఖమచ్చింది. ఉన్నయి ఉన్నట్టుగా అమ్మితే నూరు రూపాయల మాలు'. 'చెట్టుమీద ఉన్నయిగావు మంది తిన్నయిగావు' అనుకుంటూ సైకిల్ టెక్స్‌ను చేరుకుని కిరాయికట్టి సైకిల్ అప్పగించాడు.

'రేపు ఈ సైకిలి ఎవ్వలకు ఇయ్యకు. నేను కొండబోత. అలుకగపోతుంది'. ఓనర్‌తో అన్నాడు.

"నీయవ్వ.... నువ్వేం మనిషివిరా... నూర్లకు నూర్లు పండ్లు అమ్ముకుంటవు. ఒక్క పండు తినుమని ఇయ్యవు. కల్లంకాడ కడివెడు వడ్లు పోయినా ఏమనడుగనీ, కంచంకాడ కశికెడు మెతుకులు వోతే కండ్లకు నీళ్లు దీత్తడన్నట్టు, చెట్లకాడ ఎన్ని కరాబైనా ఏంగాదుగనీ, చేతుల మీదికెళ్లి నాలుగు దానంజేత్తే దుఃఖమచ్చేటట్లుంది నీకు" ఓనర్ ఈసడింపుగా అన్నాడు. పేరు పీరు సాయబు. మాటయాసగా ఉంటది.

'రేపు దెత్తతియ్యి. అయినా నేను తెచ్చుడేందో...! ఇంటికి పోయేటప్పుడు అట్లనే రా.. ఎవలకని పంచత్తదే... ఊరంత చుట్టాలేనాయె....' అంటూ అతడి మొహంలోకి చూసాడు. అప్పుడతడు కిరాయి చిల్లర పైసలు లెక్కబెట్టుకుంటున్నాడు. పొడువైన తెల్లగడ్డం నున్నగా కొరిగిన మీసం... విసురుగా తలెత్తాడు.

"అరే మాదర్‌చోద్... నాకీ డక్కా తినిపిస్తవ్‌బే... రూపాయి తక్కువిచ్చినవు. ఇట్ల కిరికిరి పెడితే సైకిలే ఇయ్య." అన్నాడు.

"ఏ.... సీసకల్లుతాగుదామనుకున్న. నువ్వు ఇడిసిపెడుతావు. రోకలిబండకు నారలు తీసేటోనివి" అంటూ రూపాయి బిళ్ల చేతికిచ్చి ఇంటి మొహం పట్టిన ముత్తయ్య కల్లుదుకాణం ముందట ఆగాడు.

లోపల నర్సయ్య, చంద్రయ్య, ఎల్లం, బాలం.... తోటల బ్యారకాళ్లు సీసలు ముంగట పెట్టుకుని మాట్లాడుకుంటున్నారు. మొదట కూర్చున్నప్పుడు వాళ్లకు వాల్లే మాట్లాడుకున్నారు. సీసల కల్లు గొంతు దిగుతుంటే వాళ్లు మాట్లాడ్డం ఆపేసారు. కల్లు ఇప్పుడు వాళ్లను మాట్లాడిస్తుంది. అందుకే దగ్గరకు చేరేవరకు ముత్తయ్యను గుర్తుపట్టలేదెవరు. కైనీడలోంచి లైటు వెలుతురులోనికి వచ్చాక మొదట గుర్తుపట్టిన ఎల్లం 'ముత్తయ్య మామా.... దాదా.. ఇప్పుడే వత్తున్నవా ఈ మధ్యల కనపడుతలేవేందీ' అన్నాడు.

'యాడకనవడుతడురా.. బంగారమసోంటి తోట దొరికింది. అన్ని పైసలే. ఏంలేదన్నా పదిరువై వెయిల లాభం...' చంద్రయ్య అన్నాడు.

"ఆ... అక్కడ చెట్లకు పండ్లు కాత్తలెవ్వు. రూపాయలే కాత్తున్నయి. "విసుక్కుంటూ

కూర్చున్నాడు ముత్తయ్య. వాల్లతో కూర్చోవడం అతనికి ఇష్టముండదికనీ, ఎక్కడేం తోటలున్నయి. ఎవరెంత ధర పెడుతనంటున్నరు...ఎంత ధర పెట్టాలెనన్న ముచ్చట్లన్నీ తెలుస్తయని కూర్చున్నాడు. పెద్ద పెద్ద బేరాలు, భయానలన్నీ కల్లు దుకాండ్లనే అయిన అనుభవం అతనికి తెలుసు.

"నీయవ్వ.. నువ్వు వట్టి ఏడుపు గొట్టోనివి. ఏం లాభమచ్చినా ఏడుత్తనే ఉంటవు...' బాలం దెప్పుతున్నాడు. సీసకు ఆదరిచ్చి మౌనంగా కూర్చున్నాడు ముత్తయ్య.

"ఏమాయె మామా... సగం తోట అమ్ముడయిందా...? సావుకారి ముల్లె ఎన్నడో ముట్టచ్చు...' ఎల్లం కెలికాడు.

"ముత్తయ్య మామ సన్నపోడు కాదు, దండోడు. మీదికుండ మీదుండంగ కిందికుండ మాయం జేస్తడు'' ఎక్కిరించాడు బాలం.

"ఏమాయె బిడ్డలగ్గంజెయ్యవా..? పైసలన్నిఎందుకు ముల్లెగడుతన్నవు...?'' ఎక్కసంగా అన్నాడు చంద్రయ్య. మౌనంగా ఉన్నవాడు నర్సయ్య మాత్రమే! మాటలు అనకుండా మాటమాటకల్లా వెటకారంగా నవ్వుతూ అందరికంటే ఎక్కువగా మంటను పుట్టిస్తున్నాడు.

ముత్తయ్య శరీరాన్ని సూదులతో పొడిచినంత బాధ. బాధను దిగమింగడానికే సీసను ఎత్తినట్టుగా ఒక్కసారి దమ్ముపట్టి తాగితే సరానవడ్డది. సీసను దించి చాతిమీద చేత్తో రాసుకున్నాడు.

మాటలు తోటల మీదకి మళ్లాయి. "బుడ్డ మామిండ్ల తోట ఏంపూత పట్టిందే... ఉన్నదున్నట్టు ఉండాలెగనీ రెండు లారీల కాయలు ఎల్లుతయి. పండ్లు మాగవెట్టి అమ్మాలె గనీ అన్నీ పైసలే!''

"పండ్లు గాదు. అండ్ల ఆరు తొక్కు (పచ్చడి) పెట్టే పుల్లటికాయల చెట్లున్నాయి. కంకెడు కంకెడు కాయలు. ఆ కాయలు అమ్ముకుంటే తోటబాకి సగం తీరుతది.''

"మొన్న సిద్దిపేట పోయిన. దేవరెడ్డి పటేలును కలిసిన పదివెయిలు నేను అడిగిన. పన్నెండు వేయిలు పటేలు చెప్పిండు. భయానపట్టుకపోయినోన్ని ఎనుకకు మరలచ్చిన''.

"చూసినవా ఆనాడు భయానా ఇస్తె ఎంత మంచిగుండు. నేను నిన్న పటేలును కలిసిన. పదిగేను వెయిలకు తక్కువియ్యనన్నడు. రోజుకు ఇద్దరు ముగ్గురస్తన్నరట. అందుకే రేటు పెంచిండు''.

"ఇంక నాలుగు రోజులాగితే ఇరువై వెయిలనేతట్టున్నడు''.

"ఇరువై వెయిలు ఇచ్చినా నష్టం లేదు. లారీకి పదిహేను వెయిలు. తోటలూటీపోయే నాటికి ముప్పయి వెయిల రూపాయలత్తయి''. అందరి మాటలు వింటూ మౌనంగా కూర్చున్నాడు ముత్తయ్య.

"మీకు అసలు సంగతి తెలువది. పటేలును అడిగితే తెగనియ్యడు బలువనియ్యడు. పటేలు లేనప్పుడు పటేలవ్వను బతిలాడాలె. అవ్వగద అప్పగద అంటే ఎంతకో ఒకంతకు ఒప్పుకుంటది. ఎల్లుండి నేను పోత చూడు'' నర్సయ్య అన్నాడు.

తోటలో ఉండే చెట్టు చెట్టు పేరు చెబుతూ ఆ కాయ పండుకు పనికస్తదో తొక్కుకు పనికస్తదో చెబుతున్నారు.

అప్పుడే జ్ఞానోదయమైనట్టు లేచాడు ముత్తయ్య. గోచిని సదురుకుంటూ బయటకు వచ్చాడు. అతడి మనసులో బుడ్డమామిండ్ల తోట మెదులుతుంది.

ముత్తయ్య వెళ్లిపోయాడని నిర్ణయించుకున్నాక నలుగురూ నవ్వుకున్నారు.

"బుడ్డ మామిండ్లతోట మొత్తం తేనె పూసింది. ఇప్పుడు పిందెలు బాగానే ఉన్నా బలివట్టేటప్పుడు మొత్తం రాలిపోతయి. మొన్న చిలుకల మామిడి గుంజాయి మామిడి గుత్తకియ్యిమని పోతే మామిడితోట పట్టుకున్నోల్లకే అవ్వి ఇస్తనన్నడు. తోటకు ఎనిమిది వెయిలు చెప్పిండు. అంతకంటే ఎక్కువ రేటు పెడితే వీటిని వట్టిగనే ఇడిచిపెడుతనన్నడు. తోటను అమ్మే జిమ్మదారు మాది. ఈ రెండు మామిండ్లను వట్టిగనే ఇయ్యాలెనని చెప్పినం. రేపు తెల్లారెవరకు ముత్తయ్య సిద్దిపేటలుంటడు. అప్పటికటే ఫోన్‌ల పటేలుతోని మాట్లాడాలె" నవ్వుతూ చెప్పాడు నర్సయ్య.

'మేమంటే ఏమిటనుకున్నవు!'' అన్నట్టుగా తలూపాడు చంద్రయ్య.

"ముత్తయ్య అంత ఎడ్డోడేం గాదు. ఎన్ని జూసికొంటడనుకున్నవు" ఎల్లం అన్నాడు.

"అన్నీ చూసినట్టే చూత్తడు. అసలు జాగల తొర్రవాడుత్తడు. మొసాంబి తోటప్పుడు చూడలేదా..? చెప్పుడు మాటలు విని అడ్డగోలు ధరవెట్టిండు. ఇప్పుడు ఒక్కటి అమ్ముతలెవ్వట. ఆ పోరి నెత్తిగుద్దుకుంటుంది.'' బాలం అన్నారు.

"నా మాట చూడు. రేపు భయాన పట్టుకుని బస్సు ఎక్కుతడో లేదో...' చంద్రయ్య అన్నాడు. మరోసారి సీసలు రౌండు తిరుగుతున్నయి. ఉత్తగనే వచ్చే రెండు మామిండ్ల కాయలలెక్కలు నర్సయ్య మనసులో తిరుగుతన్నయి.

పొద్దుటిపూట ఎవలడిగినా లెవ్వంటరని పోవుడు పోవుడే తనకు గురి ఉన్న సేటు దగ్గరికి పోయిండు ముత్తయ్య. మస్కట్ పోతానన్న, మామిడితోటలు పడుతామన్నా అప్పు పుట్టడం చాలా తేలిక. ఎందుకంటే ఆ మిత్తి ఎక్కువుంటది. పైగా అదనపు ఒప్పందాలు. పండ్లకు యాభై, తొక్కుకు యాభై కాయలు వట్టిగనే ఇస్తనని ఐదు వెయిలు అప్పు తీసుకుని ఇల్లు చేరుకున్నాడు.

'ఎట్లనన్న దొర్సానిని బతిలాడి పదివెయిలకు ఖాయం చేసుకోవాలె. రేపు తోటంతా తిరిగిరావాలె. వాళ్లు ఎవలూ వెళ్లకముందే వెళ్లి బయానా ఇచ్చి రావాలి' అనుకున్నాడు.

ఇంట్లో కరంటు వచ్చినట్టుంది. దీపంకంటే గుడ్డిగా ఉంది వెలుతురు. గుడ్డి వెలుతురులో పట్టి పట్టి చూస్తూ బీడీలు  చుడుతుంది దేవేంద్ర. ఇంట్లో అడుగుపెట్టగానే పండ్ల వాసన గుప్పుమంది. అంగీని విడిచి కొయ్యకు వేస్తుంటే జారికిందపడింది. జేబులోంచి వందనోట్లు బయట పడ్డాయి. వాటిని చూస్తూనే ఉలిక్కి పడింది దేవేంద్ర.

"ఏంది నాయినా..... పైసలా... అన్నిగనం ఎక్కడియి...?'' చేతుల బీడీని ఆపి అడిగింది. చెప్పాలా వద్దా అని ఆలోచించి చెప్పాడు ముత్తయ్య.

"బుడ్డ మామిండ్ల తోటను పట్టాలనుకుంటున్న. తోట మంచిగ కాసింది. ఈ సారి పాత బాకీలన్ని తెగిపోతయి. ఏంలేదన్నా పది ఇరువై వెయిల లాభం" చెప్పడం లేదు కానీ తోట లాభంతో నీ పెండ్లి చేస్త. బాకీలు తర్వాత కట్టచ్చు అనుకుంటున్నాడు.

చేతుల బీడి జారి కిందపడింది. అతడి మొండితనానికి కళ్లల్లో నీళ్లు తిరిగినయి. తన రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టిన పైసలు గూడా చేతికందడం లేదు.

'నాయినా.... నీకేమన్నా పిచ్చిలేసిందా... చెట్లు తేనె పూసినయని అందరు చెప్పుకుంటండ్రు. తేనె పూచిన చెట్టు కాయ నిలుస్తదా.. నువ్వు ఏ తోట పట్టుకునుడు వద్దు. సప్పుడు జేక కూసుండు. నేను బీడీలు చేసిసాదుత'' బాధగా అన్నది. "ఏదీ చేసినా లోపటికే గాని మీదికి రాదు. మిత్తిమీద

పడుతుంది. నలుగురు నాలుగు మాటలు. మందినిసాదుడు కావట్టె''.

'గట్ల నీరెక్కల కట్టం మీద నేను బతుకద్దనే బిడ్డా ఈ తండ్లాట. నిన్ను ఒకింటిదాన్ని చేసినంక నేను ఎట్లయితే గట్లయిత'. బయటకు అనలేదు. జేబులో రూపాయల నోట్లను భద్రంగా సర్ది అంగిని కొయ్యకువేసి

"మన బతుకు ఊటబాయి వంటిది బిడ్డా. నీళ్లను తోడిపోస్తుంటేనే నీళ్లు ఊరుతయి. సల్లే చెలిమె సల్లితే ఊరే చెలిమ ఊరుతది. ఊరుతయి గదాని ఆరునెలలు నీళ్లు తోడకుండా ఉంచినా నీళ్లు గంగరాళ్లను దాటి పైకి రావు. కాదు కూడదంటే ఊటలు మర్రి, బాయి ఎండుకపోతది. బతుకుగంతే! లాసత్తన్నయని ఇంట్లకూసుంటే తిండిగూడా దొరుకది. ఒకటి కాకుండే ఇంకోదాంట్ల లాభమచ్చి ఉన్న బాకీలన్నీ కొట్టుకుపోతయి'' అన్నాడు.

తండ్రివైపు బిత్తిరిచూపులు చూసింది దేవేంద్ర. అతడి మొండిపట్టు ఆమెకు తెలుసు. తల్లితో వాదులాడడం, చేత్తా అనుకున్నపనిని ఎంత వద్దని చెప్పినా వినిపించుకోకపోవడం గుర్తొచ్చింది. 'ఎండల్ల ఏకులడికి వానల్లవడ్లు దంచుతడని' తల్లి అంటూండే మాటలు గుర్తుకచ్చినయి.

"వద్దునాయినా ఊరుపక్కతోట. ఒకలు పప్పులకంటరు. ఒకలు పచ్చట్లకంటరు. ఎవలను వద్దనరాదు. ఎవలకు లెవ్వనరాదు. సగంతోట ఉగాదివరకే లూటి అయితది. బదునాం అయితం...' దేవేంద్ర బతిమాలుతనే ఉంది. ముత్తయ్యకు నిద్రముంచు కత్తుంది. మంచాన్ని వంచి మారుపలుకకుండా గొంగడిని పరిచి నడుం వాల్చాడు.

దేవేంద్ర చెబుతనే ఉంది. ఎన్ని తోటలు పట్టి ఎంతలాసయింది, ఇంట్ల వస్తువుల్ని ఎప్పు డెప్పుడు అమ్మింది, ఎంత బాకీ అయింది, ఎవరెప్పుడు వస్తుంది ఏమేం అంటుంది వివరంగా చెబుతుంది. మారుమాట వినిపించకపోవడంతో చెప్పడం ఆపి 'నాయినా' అన్నది. బదులు వినిపించలేదు కానీ చిన్న గురక వినిపించింది.

" నీ నిద్రల మన్నువాడ. నీకు రంది లేదు. ముచ్చట చెబుత చెబుతుండంగనే గుర్రు కొడుతుండు. ఇట్ల చేసిచేసి అవ్వను మింగినవు. ఇంకా తొవ్వకు రాకపోతివి. ఇన్ని రోజులు తోటలు వట్టి ఉద్దరిచ్చిండట. ఇప్పుడు ముల్లెగట్టుకుంటడట. ఏమన్నగా.... యాడనన్నసావు. నీజోలికత్తె అడుగు'' బీడీల చాటను ముందుకుతోసి చాపమీదనే ముడుచుకుని పడుకుంది దేవేంద్ర. ఆకలితో పేగులు గుర్రుమంటున్నాయి.

కళ్లు మూసుకున్నా నిద్ర రావడం లేదు.

భర్త గుర్తుకొస్తున్నాడు. అత్తగారింటి జీవితం గుర్తుకువస్తుంది. అష్టకష్టాలు పడి చేసిన పెళ్లి. అందమనుకున్న ఇంటిని అందుకున్నామన్న సంబూరం చావకముందే భర్త దూరమయ్యాడు. ఇంట్లోకి అడుగుపెట్టి కొడుకుని మింగిందని అత్త నోటికచ్చిన మాటల్ని పోనియ్యలేదు.

'వాడు వీనికంటే గొర్రె మంకురోడు. వాడు మాత్రం నన్ను ఏం ఉద్దరిచ్చిండు. వద్దంటే విన్నడా...? రాత్రి పూట క్రేన్ ఎక్కుతాడు? వాని పాణానికి వాడు పోయిండేమోకని నా బతుకుల మన్నువోసిపాయె. బతుకు ఎంగిలి ఇస్తారాకు లెక్క అయిపాయె. ఏనుగంత తండ్రి సచ్చినా ఏకులగుల్లంత తల్లి ఉండాలంటరు. అవ్వనే బతికి ఉంటే నాకీ బాధలుండునా...? మొగబాయిగాడు. ఏమని చెప్పుకుంట. కాలునొచ్చినా కడుపు నొచ్చినా ఉగ్గపట్టుకునుడేనాయె. ఎవ్వలేమన్నా ఏమని

చెప్పుకుంట? బాలుగాడు జూడు. వరుసకు మ్యానబావనాయె. పట్టపగలు ఇంట్లకస్తడు. మొన్న ఏదేదో మాట్లాడితే ఏడుసుకుంట కూసుంటివి. నాయినా గిట్లన్నడని ఏం చెప్పుతం... వీడు వాళ్ల సోపతి ఇడువడు. వాళ్లు ఏదో వంక పెట్టుకుని ఇంట్లకచ్చి వంకర మాటలన వట్టిరి.'

కండ్ల పొంట నీరుగారుతున్నయి దేవేంద్రకు.

'పైసుబిడ్డ ఇంటిమీదుంటే తల్లికైతే బరువైతది. తండ్రికి ఆసరైతది. కూడు ఉడుకపెట్టె దిక్కులేదు. నేను లేకుంటే నాయిన యాడ తింటుండె పాపం.... తోటలు పాడుగాను గుత్తవట్టక పోతే చేతుల నాలుగు పైసలుంటుండె. అప్పుడన్నా పెండ్లి గురించి ఆలోచించుకొనునేమో! ఇదేందోగని నాలుగైదు సంబంధాలచ్చినయి అన్నీ మంచియే! మొన్నచ్చిన బండలింగంపల్లి పిల్లగాడు ఎంత మంచిగున్నడు...? పెండ్లాం బాలింతరోగమచ్చి సచ్చిపోయిందట. మోసాంబీల కల్లం మీద చేస్తననె. ఏదీ...? ఏసప్పుడు లేదు. అప్పు తెచ్చి తోట వడుతుండు. అదే పైసలతోని లగ్గం జేత్తే నా బతుకేదో నేను బతుకుదుంటి. ఇంకేంది...? ఇప్పుడు మామిడితోట కల్లాలమీదంటడు... అటెనుక చింతతోట... రేనితోట.. వచ్చిన సంబంధాలు ఎత్తిపోవట్టే....'

ఆలోచనలు ఎక్కడెక్కడో తిరిగి తండ్రిమీదికి మళ్లుతున్నాయి. తన ఆలోచనలకు తనకే సిగ్గనిపిస్తుంది. అయినా ఆలోచించ  లేకుండా ఉండలేకపోతుంది.

'నాయినదేం తప్పు. ఆయన తల్లికాదు గదా! తండ్రి.... కుండలున్నది చూస్తడుగనీ కడుపుకు తిన్నది లేనిది చూస్తడా. అదే అవ్వయితే వండి బుక్కెడు నాకు పెడుతుండె...

దేవేంద్రకు నిద్రపట్టింది. నిద్రలో పెళ్లి జరిగినట్టు కలవచ్చింది. పక్కన తల్లి మాత్రమే కనిపిస్తుంది. అడుగకముందే బట్టలు కొన్నది. కొత్తబట్టల్లో చూసి మురిసిపోతుంది.

మెలుకువ వచ్చేసరికి తండ్రి మాటలు వినిపిస్తున్నాయి. "యాడపారేసుకుంటమో గాడనే వెదుక్కోవాలె సారూ... మనం ఇంకేం పనిజేస్తం. ఒకటి లాసైతే భయపడి పనిమానేస్తమా... చేసుకుంటపోతె ఎండ్లనో ఒకండ్ల లక్కు తలుగుతది. ఈ మామిడితోటల లక్కు తలిగిందనుకో. ఈ లాసంత నిండుతది".

"అదిగాదు. పెండ్లిముచ్చట జెప్పు. వాళ్లు ఏమాయె అంటుండ్రు. నిన్ననే బండలింగంపల్లి పోయిన. ఏ ముచ్చట రెండుమూడు రోజులల్ల జెప్పుమన్నరు" ఇంటిముంగటి పోచయ్యసారు.

"పెండ్లంటె వట్టిగైతదా..? ఏంలేదన్నా పది ఇరువై వెయిలన్న కావాలె. ఇప్పుడెక్కడియి. మామిడితోట అమ్మినంకనే..."

ఆ మాటలు పూర్తికానేలేదు అందుకున్నాడు పోచయ్య. "ఆ... కలేమాసిన నీ మామిడిపండ్లు కొంటరు. నువ్వు జూత్తవు. ఎండకాలమచ్చిందంటే తీరొక్క మామిడిపండు లారీల మీద దిగుతయి. అగ్గోధర. కలమామిడిపండ్లయితే అయిదే రూపాయలు. అనకపల్లి.. బెంగన్‌పల్లి... ఏమేమో అంటరు. నీ బుడ్డ మామిడిపండ్లు యాడకొంటరు? చింతచెట్లు పట్టినప్పుడు నేను చెప్పిన్నాలేదా...? చింతపండు కొట్టుకుని యాడాదిపొద్దు కుండలల్ల ఎవలు దాచిపెట్టుకుంటలేరు. అప్పటికప్పుడు అద్దకిలోనో పావుకిలోనో దూకాండ్లకు పోయి పాకెట్లు తెచ్చుకుంటండ్రని. పాకెట్లు గట్టి నిలువ పెట్టి అమ్మేటట్టు నువ్వులేకపోతివి. నీ దగ్గర ఒక్కసారికొని యాడాదిపాటు నిలువ చేసుకునేట్టు జనం లేకపోయిరి. నడుమ ఎవలో బతుకవట్టిరి. నువ్వు పది రూపాయలకు కిలో అమ్మినా ఎవలూ కొనరుగనీ... పది

రూపాయలు పెట్టి పండ్లరసం పాకెట్టు కొనుక్కొని తాగుతరు...''

"సారూ... గవన్నీ నాకు తెల్వయి...'' అందుకున్నాడు ముత్తయ్య. ఆ లోపే "బతుకు ఊటబాయి అని మాత్రం తెలుసంటవు... నవ్వుతూ అతడు చెప్పే మాటలే చెబుతున్నాడు పోచయ్య. అతడి మాటల్ని లోతుగానే చూసినట్టున్నాడు. తాత్వికంగా చెబుతున్నాడు.

అప్పటికే తోటను తిరిగివచ్చినట్టున్నాడు ముత్తయ్య. తోట గురించి మాటలు సాగుతున్నాయి. తెల్లవారింది. వాళ్లమాటలు వింటూనే చీపురుతో వాకిట్లోకి నడిచింది దేవేంద్ర. మాటల మధ్యలో పెళ్లి విషయం మళ్లీ వస్తుందేమోనని జాగ్రత్తగా విన్నది. ఇద్దరూ అక్కడినుండి సానుపు చల్లె ముందు లేచిపోయారు. దేవేంద్ర మనసు బాధగా మూలిగింది.

వారం రోజులు తండ్రితో మాట్లాడలేదు దేవేంద్ర. అతడే అవసరమున్నప్పుడు మాట్లాడు తున్నాడు. కూతురు తనతో మాట్లాడ్డం లేదన్న ఆలోచన కూడారావడంలేదు. పదివెయిలకు తోట గుత్తకు కుదిరింది. ఒకటి రెండు తప్ప మొసాంబీలు అమ్మడుపోవడం లేదు. అందరినీ పిలిచి పంచిపెడుతున్నాడు.

మామిడి పిందెలను చూస్తుంటే ఎక్కడలేని ధైర్యం వస్తుంది. ఆకుకు ఒక్క కాయున్నట్టు చెట్లనిండా విరగకాచినయి. రోజులు గడుస్తుంటే దేవేంద్ర కోపం కూడా తగ్గిపోయింది. తోటవైపు వెళ్లి చూసివస్తుంది. కాయలను చూస్తుంటే ఆమెకు కూడా ఏదో ఆశపుట్టుకచ్చింది. పెండ్లి గుర్తొచ్చింది.

మామిడికాయలు ఉల్లిగడ్డలంత అయినాయంటే చాలు. ఊరోళ్లకండ్లన్నీ తోట మీదనే! పక్కనుండే పొలాల రైతులైతే మరీనూ! ఎప్పుడు వాటమైతే అప్పుడు రాలగొడ్తారు. మామిడి తోటకు ఒకవైపున బండ్లబాట. వచ్చిపోయే వారు కూడా రాయి విసురక మానరు. కాయలు రాలగొట్టేప్పుడు ముత్తయ్య వస్తే 'రెండు కాయలు పప్పులకని రాలగొడుతున్ననని' వరుస కలిపి మాట్లాడుతరు.

వారికి తగ్గట్టుగానే ముత్తయ్య నోరు పెద్దది చేసుకున్నాడు. చెట్టుకింద మనిషి కనబడితే చాలు. దూరం నుంచే బూతుమాటలు తిట్టి దగ్గరికి వచ్చాక. 'అయ్యో! నువ్వా బావా! సూడక మాటలంటి. నాకు చెబితే నేనే రాలగొట్టిద్దు కదా అంటాడు. అందుకే చెట్టుకిందకి వెళ్లడానికే భయపడుతున్నారు జనం.

కాయలు కాసినయి కాసినట్టే బలిపట్టినయి. ఒక్క కాయ రాలలేదు. దానికి తోడు గాలిదుమారం లేదు. ఉగాదినాడైతే తండ్రీకూతుళ్లిద్దరూ రాత్రంతా కావలున్నారు. ఎంతకాదనుకున్నా రెండు సంచుల కాయలు రాలగొట్టుకపోయిండ్రు.

కాయలు కంకెడు కంకెడయినయి. గుత్తులకు గుత్తులు గాలికి ఊగుతున్నయి. ముత్తయ్య ఇంటికి రావడం మానివేసిండు. తోట దగ్గరికే సద్ది. కాయలు పీచుగడుతున్నయి. గట్టిగా గాలిపెట్టి ఊగుతుంటే తానే చెట్టుకొమ్మకు యాలాడుతున్నట్టుగా తల్లడిల్లిపోతుంది దేవేంద్ర. ఒకటి రెండు రాలితే రాలిన కాయల్ని ఏ కోమట్లకో ఆటాన రూపాయికి అంటగడుతుంది.

"చూసినావు బిడ్డా... తోట వద్దు వద్దంటివి. తెగారం జేసిపట్టినందుకు నాలుగు కాయలు కనపడుతున్నయి. ఈ కాయలు ఉన్నయి ఉన్నట్టు ఉండాలెగనీ మన ఇల్లు బంగారమే'' ఒకనాడు సద్దితెచ్చిన కూతురుతో అన్నాడు ముత్తయ్య.

"నాయినా ఇప్పటికి తెల్లారిందా... గట్టిగ గాలిపెడితే చాలు. కాయలన్నీ రాలుతయి. అసలు

మన బతుకే పండ్లచెట్టు. యానంగనో ఒక రౌతు వచ్చి తాకుతది. ఏ పిట్టనో ముక్కుతోని పొడుత్తది. ఏ గాలిదుమారమో చిచ్చుపెడుతది. ఏ రాళ్ళవాననో కొమ్మలకు కొమ్మల్ని ఇరుగగొడుతది...'' భయం భయంగా చెప్పింది.

కాయలు పీసుగట్టినయి. దేవేంద్ర ఆలోచనలన్నీ తోటచుట్టే తిరుగుతన్నయి. మొగులు మీద మచ్చకనబడితే దిగులుగా చూస్తుంది. ఆకాశం ఎర్రసాలు వారితే ఏడుస్తుంది. ముత్తయ్య మాత్రం చెట్లకిందే గోరికట్టుకున్నాడు.

దేవేంద్ర భయపడ్డంతా అయింది ఒకనాడు పొద్దుగూకే జాము గాలివాన మొదలయింది. వట్టి వానైతే లాభమే! చెట్టు మీదున్న చీమలు, ఎర్రకోయిల్లు రాలిపోతయి. కానీ వానకంటే ఎక్కువ గాలి. విపరీతమైన గాలి! తండ్రి తోటవద్దనే ఉన్నాడు. దేవేంద్ర సోకం పెట్టుకుని ఏడ్చింది. వాన కొద్దిగా తెరిపి ఇయ్యగానే తోట దగ్గరికి పరిగెత్తింది.

చెట్లకింద ఎండబోసినట్టు రాలినకాయలు, సగంకు పయినే రాలాయి. లారీలోడుకాయ. కాయలమధ్య ముత్తయ్య తిరుగుతున్నాడు. తండ్రిని, కాయలను చూడగానే గుండె చెరువై పోయింది. తండ్రి మీద పడి బావురుమంది దేవేంద్ర.

"ఏడవకు బిడ్డా ఇప్పుడు ఏమైందే... మనకే నయ్యమయింది. కాయలు తెంపే పని తప్పింది. ఇన్ని కాయలు తెంపాలంటే వెయ్యిరూపాయలు ఖర్చు అయితుండె. అవ్వి మనకు లాభమే'' ఓదారుస్తూ అన్నాడు ముత్తయ్య.

తండ్రివైపు వింతగా చూసింది దేవేంద్ర.

"ఔను బిడ్డా! ఇవి తంకర గీకిచ్చి అమ్మాలనుకున్న. రేపో ఎల్లుండో తెంపాలనుకున్న ఇంతట్లకే ఈ వాన'' నవ్వుతున్నాడు ముత్తయ్య.

మరునాడే పదిమంది కూలీలను పిలిచి ఇనుపకశికలతో కాయల్ని తంకర గీకించి ఎండబెట్టాడు. పదిహేను రోజుల్లో తంకర అమ్ముడు పోయింది.

మిగిలిన కాయల్ని తెంపాలనుకున్నప్పుడు మళ్లీ గాలివాన. ఆడకూలీలతో మళ్లీ తంకర గీయించాడు. అదీ అమ్ముడయింది. తొక్కు కాయల్ని అమ్మాడు. మిగిలిన కొన్ని పండ్లకు అమ్మి. లెక్కచూసుకున్నాడు. ముప్పయి వెయిలచ్చినయి.

చెట్టుమీద కొమ్మకు నాలుగైదు పరిగెకాయలు మిగిలినయి. లెక్కనంతా కూతురుకు అప్పజెప్పి డబ్బును చేతిలో పెట్టాడు ముత్తయ్య. అతడికి రాజ్యాలను గెలుచుకున్నంత సంతోషం. 'ఇంక నాలుగైదు వెయిల మాలు చెట్టుమీదుంది బిడ్డా. మెల్లగ అప్పుడిన్ని ఇప్పుడిన్ని తెంపి అమ్ముకుందాం' కొంకిడి కట్టెను పట్టుకుని అన్నాడు.

ఎవరికైనా పండ్లకు, పచ్చడికి కాయలు అవసర మౌతాయేమో అడిగి తెలుసుకుని తండ్రికి చెబుతుంది దేవేంద్ర. శిక్కంలో కాయల్ని తెంపి వాళ్లకు అప్పగిస్తున్నాడు ముత్తయ్య. ఐదు వెయిలనుకున్న లాభం ఏడు వెయిలను దాటింది. తన కళ్లను తానే నమ్మలేకపోయింది. దేవేంద్ర, పెండ్లి సంగతి గుర్తొచ్చి సిగ్గుపడింది.

పొద్దున మాపున ఎవరికి ఎప్పుడు అవసరముంటే అప్పుడే చెట్టెక్కుతున్నాడు ముత్తయ్య. కాయలు తెంపడం పూర్తయిందనుకున్న రోజున జరిగిందా సంఘటన. అడుగుపెట్టిన కొమ్మ విరిగింది.

జడుపు ఎక్కువయ్యే సరికి చేతుల కొమ్మ పిసికిపోయింది. అప్పుడు ముత్తయ్య చెట్టు చివరి కొమ్మ మీదున్నాడు. అక్కడినుండి కిందపడ్డాడు. కింద రాళ్లు రప్పలు. తలకు దెబ్బ తగిలింది. కాలువిరిగింది. ఎవరో చెబితే ఏడ్చుకుంటూ పరుగెత్తింది దేవేంద్ర.

ట్రాక్టర్ మీద హాస్పిటల్ తీసుకెళ్లారు. తలకు, కాలుకు కట్టుకట్టారు. ఎక్స్‌రేలు... పరీక్షలు, రక్తం కొనుడు, సిమెంటు పట్టీ... మందులు... నెల రోజులకు గానీ హాస్పిటల్ నుంచి ఇంటికి రాలేదు ముత్తయ్య.

వచ్చిన డబ్బు ఖర్చయిపోయింది. అప్పు అప్పులాగే ఉంది. దేవేంద్ర గుడ్లనీరు గుడ్లల్లోకుక్కుకుని బీడీల చాటముందు కూర్చుంది. నాలుగురోజులు ఇంట్లో ఉండి మురిపించిన నోట్లకట్టలు.... వాటి చుట్టూ అల్లుకున్న ఆశలు, ఆలోచనలు... డబ్బు లాగేరెక్కలొచ్చి ఎగిరి పోయాక...

వచ్చేది ఆయిటిమూనిన దినం. ఎక్కడైనా అల్లనేరేడు తోటలున్నాయేమోనని వెదుకుతున్నాడు ముత్తయ్య. కొత్త ఆశలతో దేవేంద్ర ఎదురు చూస్తోంది.

అవును, బతుకు ఊటబాయి కదా! ఎప్పుడూ నీళ్లు తోడుతూనే ఉండాలి. పూటిక తీస్తూనే ఉండాలి. లేకుంటే ఊటలు మరలిపోతాయి. బాయి ఎండుకుపోతుంది! ●